క్లుప్తంగా

మున్నంగి లింగారెడ్డి మృతికి అంబటి మురళీకృష్ణ నివాళి



వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మున్నంగి లింగారెడ్డి మృతికి పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నివాళులు అర్పించారు. వేజండ్ల గ్రామానికి చెందిన లింగారెడ్డి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేశారు. ఆకస్మికంగా లింగారెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాసు ఈశ్వరరెడ్డి, ఆళ్ల శ్రీరామిరెడ్డి, బి.భాస్కరరెడ్డి, ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పల్సెస్ ఎక్స్‌పోర్ట్ మర్చంట్స్ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు కనమర్లపూడి సత్యనారాయణ

పొన్నూరు: అపరాల వ్యాపారానికి కేంద్ర బిందువుగా ఉన్న పొన్నూరు.. పల్సెస్ ఎక్స్‌పోర్ట్ మర్చెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కనమర్లపూడి సత్యనారాయణ, కార్యదర్శిగా వక్కలగడ్డ మోహనరావు ఎన్నికయ్యారు. సోమవారం సంఘ కార్యాలయంలో వ్యాపారుల సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా నారాయణం మేఘనాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, అన్నవరపు నాగ వెంకట కృష్ణారావు, కొత్తూరి ఆనంద్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



కాకుమాను: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ కథనం ప్రకారం బాపట్ల జిల్లా అడుసుమల్లి గ్రామానికి చెందిన ఊట్ల నాగేశ్వరరావు(55) ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి స్వగ్రామం వెళ్లే క్రమంలో అబ్బినేనిగుంటపాలెం సమీపంలోని మహాదేవ్ కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆగిన ఉన్న లారీని ఢీకొట్టాడు. నాగేశ్వరరావుకు గాయాలు కావడంతో చుట్టుపక్కల వారు 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి గల వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ మధు పవన్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నాగరాజు



గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా చిన్నపలకలూరు గ్రామానికి చెందిన దాసరి నాగరాజును నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. నాగరాజు గతంలో రూరల్ మండలం వైస్ ఎంపీపీగా, చిన్నపలకలూరు గ్రామ ఎంపీటీసీగా పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు తనవంతుగా పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

వాసవీ మాత గుడి నిర్మాణానికి భూమి పూజ



చేబ్రోలు: చేబ్రోలులో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం సోమవారం జరిగింది. తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు తదితరులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక నిత్యానందాశ్రమ సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి, శారదా అమ్మవార్లు, ఆది శంకరాచార్యుల నూతన దేశాలయ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా దేవత మూల మంత్ర హోమములు, అస్త్ర మంత్ర హోమములు, మహా పూర్ణాహుతి, మహాదాశీర్వచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

‘డ్రైయిన్’ డెడ్

- స్తంభించిన డ్రైయినేజీ వ్యవస్థ
- కాలువల్లో కదలని మురుగు
- దోమల స్వైరవిహారం
- నో ఫాగింగ్
- డ్రోన్ వినియోగం మూన్నాళ్ల ముచ్చటే



ప్రధాన డ్రైయిన్‌లో నిలిచిన చెత్త, వ్యర్థాలు



ద్రావణం పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ (ఫైల్)

పొన్నూరు: పట్టణంలో మురుగు పారుదల వ్యవస్థ స్తంభించింది. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ప్రధాన మురుగు కాలువలు చెత్తా చెదారం, ఇతరత్రా వ్యర్థాలతో నిండిపోయాయి. డ్రెయిన్లలో పూడికతీత పనులు నిరంతరం చేపట్టడంలో పురపాలక సంఘ ప్రజారోగ్య విభాగం విఫలమైంది. ఫలితంగా దోమలు విచ్చలవిడిగా పెరిగాయి. మురుగు నీటి నిల్వ వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు పొంచి ఉన్నాయని పట్టణ వాసులు ఆవేదన చెందుతున్నారు. పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న రూ. లక్షలు పారిశుద్ధ్యానికి ఖర్చు చేస్తున్నా.. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడడం లేదు. ఫాగింగ్ చర్యలూ అధికారులు చేపట్టడం లేదు. ఖాళీ స్థలాలు, గుంతలు, కాలువల్లో మురుగునీరు నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల నియంత్రణకు డ్రోన్లు ఉపయోగించాలని నిర్ణయించి.. రెండు నెలల క్రితం వాటితో ద్రావణం పిచికారీ చేశారు. ఆ తరువాత ఆ విషయం మరిచిపోయారు. పురపాలక సంఘ పరిధిలో 31 వార్డులు, 17 సచివాలయాలు ఉండగా.. సుమారు 17 వేల గృహాలు ఉన్నాయి. దాదాపు 70 వేల జనాభా ఉంది. వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిలో మురుగునీరు నిలిచి, పిచ్చిమొక్కలతో నిండిపోయిఅధ్వానంగా తయారయ్యాయి. వీటితోపాటు పట్టణ పరిధిలో ప్రధాన పంట కాలువలు ఉన్నాయి. పలు రకాల పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క, వ్యర్థాలు కాలువలకు అడ్డంగా ఉండటంతో మురుగునీరు సక్రమంగా వెళ్లడం లేదు. ఇరుకు సందులు, ముళ్ల పొదలు, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వచేరే ప్రాంతాలు అధికంగా ఉన్నాయి.

డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం

పట్టణంలో డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరిచే విధంగా తగిన చర్యలు చేపడుతున్నాం. ఇతర ప్రాంతం నుంచి డ్రోన్‌ను తీసుకువచ్చి దాని పని తీరును పరిశీలించాం. గుర్తించిన ప్రాంతాల్లో ఇటీవల డ్రోన్ ద్వారా ఇళ్లమధ్య ఖాళీ స్థలాల్లో, పెద్ద కాలువల్లో ద్రావణం పిచికారీ చేశాం. చిన్న కాలువల్లో స్ప్రేయింగ్ చేయించాం.

– శ్రీనివాస్.
శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొన్నూరు


దాగుడు మూతల దండాకోడ్



నోటీసు బోర్డులో ‘మంచి ప్రభుత్వం’ కరపత్రాలు, స్టిక్కర్లు



మండల పరిషత్ కార్యాలయం ఎదుట టీడీపీ గుర్తులు, రంగులతో సిమెంటు బల్లలు



ప్రత్తిపాడు గ్రామసచివాలయం-2లో చంద్రబాబు నాయుడు ఫొటోలతో కనిపిస్తున్న వాల్‌పోస్టర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో

అధికారులు దాగుడుమూతలాడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారపార్టీ రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న పోస్టర్లను తొలగించలేదు. ప్రత్తిపాడులోని గ్రామ సచివాలయం-2 నోటీసు బోర్డులో ‘ఇది మంచి ప్రభుత్వం’ పోస్టర్లతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటోలతో స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలపైనా తెలుగుదేశం పార్టీ గుర్తులు, రంగులు కనిపిస్తున్నాయి.

– ప్రత్తిపాడు

సూపర్ సిక్స్ హామీలు తక్షణమే నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

తెనాలి: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం తీర్మానించింది. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఏర్పాటైన తొలి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సమన్వయ కర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు మాట్లాడారు. సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలతో అంబటి రాంబాబు తీర్మానాలను ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేశామని చెబుతున్న ఏడాదికి మూడు సిలెండర్ల పథకంలో కేవలం ఒక సిలెండరు మాత్రమే ఇచ్చారని, ఆర్థికసంవత్సరం లోగా మిగిలిన రెండు సిలిండర్లను ఇవ్వాలని కోరుతూ మరో తీర్మానం చేశారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో కార్యవర్గ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. పార్టీ నూతన కార్యవర్గంలో నియమితులైన జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, లీగల్ సెల్, రైతు కమిటీ, ఎస్సీ సెల్ వంటి అనుబంధాల సంఘాల నేతలు పాల్గొన్నారు.

‘ప్రేమ శిఖరం‘ పద్య కావ్యం ఆవిష్కరణ



ప్రేమశిఖరం ఆవిష్కరణ సభలో..

నగరంపాలెం: వ్యక్తి ప్రేమ కంటే విశ్వజనీన ప్రేమ అజరామరంగా విరాజిల్లుతుందని సాహితీ భారతి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సోమవారం ‘ప్రేమ శిఖరం’ పద్య కావ్యం ఆవిష్కరణ సభ నిర్వహించారు. లఘు చిత్ర దర్శకుడు గన్నే వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ఢమరుకం లలిత కళా సమితి ఆధ్వర్యంలో సాహిత్య బ్రహ్మ డాక్టర్ వీవీఎల్ నరసింహారావు ఆనంద భిక్షువు పద్య కావ్యం ప్రముఖ రచయిత చిటిప్రోలు వెంకటరత్నం నాటకీకరించారు. డాక్టర్ భవానీదేవి గ్రంథావిష్కరణ చేయగా, వెంకటరత్నం, జయప్రద దంపతులకు తొలి ప్రతిని అందించారు. డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి సమీక్ష నిర్వహించారు. గన్ని శాన్వితకు నాట్య మంజీర బిరుదు, చిత్రకళలో నైపుణ్యాలను ప్రదర్శించిన 20 మంది చిన్నారులకు యువ చిత్రరత్న పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, డాక్టర్ మైలవరపు లలితకుమారి, వి.ఎస్.విద్యాసాగర్, చేగొండి సత్యనారాయణమూర్తి, ఢమరుకం లలిత కళా సమితి వ్యవస్థాపకులు వి.మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయాలి



కాకుమాను: వృద్ధురాలిపై లైంగికదాడి చేసి ఆమె మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గత ఆదివారం గ్రామ శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నివసించే వృద్ధురాలు ఓ మానవ మృగం చేతిలో లైంగికదాడికి గురై మరణించిన విషయం తెలిసిందే. వృద్ధురాలి మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం నేతలు వృద్ధురాలికి నివాళి అర్పించారు. రమేష్ బాబు మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో క్యాన్సర్ నివారణపై అవగాహన



గుంటూరు రూరల్: ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో క్యాన్సర్ నివారణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అమెరికన్ అంకాలజీ డీఎం డాక్టర్ బి.మీనుచంద్ర మాట్లాడుతూ సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబార్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.సాయిశంకర్, ఐడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ సౌజన్య, సెక్రటరీ ఎన్.ఆదిత్య, డాక్టర్ సుబ్బానాయుడు క్యాన్సర్ నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్యాన్సర్ నివారణ ప్రతిజ్ఞ చేశారు.

డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు తెలుగువెలుగు పురస్కారం

తెనాలి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)కి తెలుగు వెలుగు సాహితీ సేవా పురస్కారం స్వీకరించారు. ప్రస్తుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, తెలుగు వెలుగు సంస్థ ఛైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చేతులమీదుగా సత్కారం జరిగింది. ఇదే వేదికపై రమేష్ రచించిన ‘గంగాహారతులు’, ‘శస్త్రాలు’ పుస్తకాలను మండల బుద్ధప్రసాద్, కత్తి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను పలువురు రచయితలు, కవులు అభినందించారు.

చదువుల ‘వసంత’ం



మంచాలలో సరస్వతీ దేవిగా ఆదిలక్ష్మి కామేశ్వరి కటాక్షం



పూజలు చేస్తున్న పదవ తరగతి విద్యార్థులు

ప్రత్తిపాడు/చేబ్రోలు: చదువుల తల్లి సరస్వతీ దేవికి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి జన్మదినమైన వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సరస్వతి రామా కోచింగ్ సెంటరులో పదవ తరగతి విద్యార్థులు అమ్మవారికి పూజలు చేశారు. హారతులిచ్చి కరుణించాలని కోరారు. రానున్న పరీక్షల్లో ఉత్తమ మార్కులు వచ్చేలా చూడాలని పూజలు జరిపారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని ఆదిలక్ష్మి కామేశ్వరి దేవాలయంలో వసంత పంచమి సందర్భంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవీ అలకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గుంటూరు రూరల్: గోరంట్ల అన్నపూర్ణనగర్‌లోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు కనులపండుగగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ, పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించినట్టు చెప్పారు. మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని సమీప గ్రామాలకు చెందిన 20వేల మందికిపైగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదం స్వీకరించారన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయని వెల్లడించారు.

దర్శనం కరువు.. తాళాలే నెలవు

- హౌసింగ్ కార్యాలయం ఎప్పుడూ మూతే
- కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణలు



సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తాళాలు వేసి ఉన్న ప్రత్తిపాడులోని హౌసింగ్ కార్యాలయం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని హౌసింగ్ కార్యాలయానికి నిర్లక్ష్య గ్రహణం పట్టింది. అధికారులు, సిబ్బంది కార్యాలయంలో ఎప్పుడు ఉంటారో.. ఎప్పుడు ఉండరో తెలియని దుస్థితి. సమావేశాలు, సమీక్షలు, జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాలు, డీఈఈ కార్యాలయ పనులంటూ సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం హౌసింగ్ లబ్ధిదారులకు ఇసుక, ఇనుము, అందిస్తుండటంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పనులు మానుకుని గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి వ్యయ ప్రయాసలకోర్చి వస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీసం సమాధానం చెప్పే నాథులే కరువవుతున్నారు. తాళాలు వేసి ఉన్న కార్యాలయం దర్శనమిస్తుండటంతో ఏమిచేయాలో పాలుపోక ప్రజలు కార్యాలయం ముందే గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అందుకు దర్పణమే ఈ చిత్రం సోమవారం మధ్యాహ్నం పన్నెండున్నర గంటల సమయంలో ఇదిగో ఇలా కార్యాలయానికి తాళాలు వేసి ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు, ప్రజలు ఉదయం నుండి సాయంత్రం వరకు తిండి కూడా తినకుండా నిరీక్షించాల్సి వచ్చింది. ఇది ఒక్కరోజు పరిస్థితి కాదు. నిత్యం ప్రత్తిపాడు హౌసింగ్ కార్యాలయంలో ఇదే తంతు జరుగుతున్నా, ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దరఖాస్తు చేసేందుకు వచ్చా



నేను ఇంటికి దరఖాస్తు పెట్టుకుందామని వచ్చాను. ఇక్కడకు వస్తే కార్యాలయానికి తాళాలు వేసి ఉన్నాయి. దరఖాస్తు ఎక్కడ, పెట్టుకోవాలి? ఎలా పెట్టుకోవాలో అడిగి వెళదామని వచ్చాను.

– ఒ.రమేష్, తూర్పుపాలెం

ఇసుక కోసం రమ్మన్నారు



నేను ఇల్లు కట్టుకుంటున్నాను. మొన్న ఒక ట్రక్కు ఇసుక ఇచ్చారు. ఇంకో ట్రక్కు ఇసుక కోసం నిన్న వస్తే ఈ రోజు రమ్మన్నారు. ఈ రోజు వస్తే ఇక్కడ ఎవ్వరూ లేరు. తాళాలు వేసి ఉన్నాయి. వస్తారేమోనని పొద్దున నుంచి ఇక్కడే కూర్చున్నాను.

– ఎం.తిరపతమ్మ, పాతమల్లాయపాలెం

విద్యతోనే ఉజ్వల భవిత



కాకుమాను: విద్యతోనే ఉజ్వల భవిత సిద్ధిస్తుందని ఐఏఎస్ అధికారి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఎం.వి.ఆర్ కృష్ణ తేజ అన్నారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడులోని శ్రీనివాస పబ్లిక్ స్కూల్ 38వ వార్షికోత్సవం, సీబీఎస్‌సీ ప్రారంభోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కృష్ణతేజ మాట్లాడుతూ కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. 393 మంది తల్లి దండ్రులను కోల్పోయిన విద్యార్థులను దాతల సాయంతో తాను చదివిస్తున్నట్టు వివరించారు. పాఠశాల గౌరవ అధ్యక్షులు దాసరి శేషగిరిరావు, అధ్యక్షులు నర్రా బాలకృష్ణ,సెక్రటరి విద్యాసాగర్ గుప్తా, ప్రిన్సిపల్ కె.శాంత కుమారి పాల్గొన్నారు.

7న లక్ష డప్పులు.. వేల గొంతులు సాంస్కృతిక ప్రదర్శన

నెహ్రూనగర్: మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు భారీ సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ పొలిట్ బ్యూరో సభ్యులు చలివేంద్రం వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం సంజీవయ్యనగర్‌లో ప్రదర్శన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

సరస్వతి స్కూల్లో వసంత పంచమి వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామనగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు చిన్నారులకు తల్లిదండ్రులు పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానసవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సన్మానం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యశశ్వి రమణను సోమవారం సూపరింటెండెంట్ స్వగ్రామమైన గణపవరానికి చెందిన కల్లంపల్లి అచ్చయ మిత్రమండలి సన్మానించింది. ఈసందర్భంగా మిత్రమండలి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ యశశ్వి రమణ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులై గణపవరం గ్రామానికి వన్నెతెచ్చారని కొనియాడారు. ఎంతో మందికి కంటి ఆపరేషన్లు చేయించి పేదలకు కంటి చూపు భాగ్యాన్ని కల్పించడంలో డాక్టర్ యశశ్వి రమణ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, గణపవరం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వంద డస్ట్‌బిన్‌లు వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకుని గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన 1960 బ్యాచ్ జీవైఎంసీఏఎస్ఏ సభ్యులు వంద డస్ట్‌బిన్‌లను సోమవారం విరాళంగా అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణకు జీవైఎంసీఏఎస్ఏ సభ్యులు డాక్టర్ బాలభాస్కర్, డాక్టర్ హనుమంతరావు అందజేశారు.

జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు వీల్స్ చైర్స్ వితరణ

గుంటూరు మెడికల్: బెవిలిన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రోగుల సౌకర్యార్థం గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు వీల్ చైర్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ బెవిలిన్ ఫార్మా కంపెనీ చేసిన వితరణ అభినందనీయమన్నారు. కంపెనీ రీజినల్ మేనేజర్ టి.రాఘవేంద్ర రావు, ఏరియా మేనేజర్ ఎ.శ్రీనివాస రెడ్డిలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటసుందరాచారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు. అరుణ కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ బిందు మాధవి, డాక్టర్ భారవీదేవిలు పాల్గొన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ రోగులకు సౌకర్యాలను మెరుగుపరిచే క్రమంలో దాతలు ముందుకు రావాలని కోరారు.